సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



ఏపీజీవీబీ.. ఇక టీజీబీ

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మరింత విస్తృతమైన సేవలందించనుంది. 8లో



..మదిలో మహోన్నత స్థానం

గడిచిన వందేళ్లలో సీపీఐ ప్రజల మనస్సుల్లో మహోన్నత స్థానం దక్కించుకుందని పార్టీ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా తెలిపారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం రోజంతా చలిగాలుల తీవ్రత ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్


వైభవంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున గర్భ గుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. నిత్య కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం ఆలయ పవిత్రత, భక్తుల సర్వశ్రేయస్సు కోసం గణపతి పూజ, చండీహోమం చేశారు. అమ్మవారిని నివేదన, హారతి సమర్పించాక మంత్ర పుష్పం పఠించారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శకులేరి?

సింగరేణి బోర్డులో మొత్తం ఐదు డైరెక్టర్‌ పోస్టులు

- ప్రస్తుతం విధుల్లో ఉన్నది ఇద్దరే..
- అదనపు బాధ్యతలతోనే నెట్టుకొస్తున్న వైనం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ అయిన సింగరేణి.. బొగ్గు తవ్వకాలతో పాటు థర్మల్, సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తి రంగాల్లోనూ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సంస్థలో 51 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండగా 49 శాతం కేంద్ర ప్రభుత్వానిది. సింగరేణి బోర్డులో సంస్థ నుంచి ఐదుగురు డైరెక్టర్లు, ఒక సీఎండీ పని చేసేవారు. వీరితో పాటు కేంద్ర ప్రభుత్వ నామినీ డైరెక్టర్లు ముగ్గురు, రాష్ట్ర ప్రభుత్వ నామినీ డైరెక్టర్లు మరో ఇద్దరు ఉన్నారు. ఈ సంస్థ నిర్వహణ, కార్మికులు, ఉద్యోగుల బాగోగులు చూడాల్సిన బాధ్యత సంస్థ మేనేజ్‌మెంట్‌గా వ్యవహరించే బోర్డు ఆఫ్‌ డైరెక్టర్లకు ఉంటుంది. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత ఈ బోర్డులో డైరెక్టర్ల పోస్టుల భర్తీలో ఎప్పటికప్పుడు జాప్యం జరుగుతోంది.

తెలంగాణ వచ్చాకే..

సింగరేణి సంస్థ నిర్వహణ బాధ్యతలు చూసేందుకు ఇద్దరు ఆలిండియా స్థాయి (సివిల్స్‌) అధికారులను ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. ఇందులో ఒకరు చైర్మన్‌ అండ్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ (సీఎండీ)గా అత్యున్నత స్థానంలో ఉండగా, రెండో స్థానంలో డైరెక్టర్‌ పా (పర్సనల్, అకౌంట్స్, వెల్ఫేర్‌) పోస్టు ఉంది. సాధారణంగా ఈ రెండు పోస్టుల్లో ఐఏఎస్‌లను నియమించడం ఆనవాయితీగా ఉండేది. పా విషయానికి వస్తే 2014 వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. కానీ ఆ తర్వాత సంస్థలో వివిధ హోదాల్లో పని చేస్తూ డైరెక్టర్‌ స్థాయికి చేరుకున్న వారికి పా బాధ్యతలు అప్పగిస్తున్నారు. అప్పటి నుంచే డైరెక్టర్‌ పోస్టులను క్రమం తప్పకుండా భర్తీ చేసే విషయంలోనూ శ్రద్ధ తగ్గుతూ వస్తోంది.

'పా' చుట్టూ మిస్టరీ..

ప్రస్తుత సీఎండీ బలరాంనాయక్‌ దగ్గరే డైరెక్టర్‌ ఫైనాన్స్‌ కూడా ఉండడం గమనార్హం. గతంలో ఆయన ఫైనాన్స్‌ డైరెక్టర్‌గా ఉంటూనే పా బాధ్యతలు కూడా చూశారు. బలరాంనాయక్‌ సీఎండీగా వెళ్లగానే ఆపరేషన్స్‌ డైరెక్టర్‌గా ఉన్న ఎన్‌వీకే శ్రీనివాస్‌కు 'పా'గా ఈ ఏడాది జనవరి 21న బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా ఒక అధికారి 'పా' హోదాలో రెండున్నరేళ్ల పని చేయడం సింగరేణిలో ఆనవాయితీగా వస్తోంది. కానీ సెప్టెంబర్‌ 12న 'పా' బాధ్యతలను డైరెక్టర్‌ వెంకటేశ్వరరెడ్డి (ప్రాజెక్ట్, ప్లానింగ్‌)కి అప్పగించారు మరోవైపు డైరెక్టర్‌ సత్యనారాయణరావు (ఎలక్ట్రికల్, మెకానికల్‌)కు ఆపరేషన్స్‌ బాధ్యతలు కట్టబెట్టారు. ఈ మేరకు మౌఖిక ఆదేశాలు అందాయి. ఆ రోజు నుంచి నేటి వరకు ఎన్‌వీకే శ్రీనివాస్‌ సంస్థ రెగ్యులర్‌ విధుల్లో నేరుగా పాలుపంచుకున్న దాఖలాలు లేవు. ఆయన సెలవులో ఉన్నట్టుగా సమాచారం. మరోవైపు సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో ఆపరేషన్స్, పా రెండు బాధ్యతలు ఎన్‌వీకే శ్రీనివాస్‌ నిర్వహిస్తున్నట్టుగా ఇప్పటికీ ఉండడం విశేషం.

కీలక నిర్ణయాల్లో జాప్యం..

ప్రస్తుతం సింగరేణిలో ముగ్గురు డైరెక్టర్ల హోదాలో ఉండగా ప్రతీ ఒక్కరు మరో విభాగం పనులు అదనంగా నిర్వహిస్తున్నారు. దీంతో సంస్థ విస్తరణ, అభివృద్ధి విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతుందనే అభిప్రాయం బలపడుతోంది. ఇందుకు తగ్గట్టుగా గడిచిన మూడేళ్లుగా సింగరేణి సంస్థ కొత్తగా ఒక్క గని కూడా ప్రారంభించలేకపోయింది. రెండేళ్లుగా నివేదించే వార్షిక సమీక్షల్లో గోలేటి(మందమర్రి), రొంపేడు(ఇల్లెందు), వీకే (కొత్తగూడెం) గనులతో పాటు ఒడిశాలోని నైనీ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని పేర్కొంటున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో చర్యలు లేవు. గనుల ప్రారంభానికి అవసరమైన అనుమతుల సాధన, ఇతర పనులు చేపట్టకపోవడంతో ఇప్పటికీ ఇవి ప్రారంభం కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపు ఈ గనులు అందుబాటులోకి వచ్చేది అనుమానమే.

ప్రారంభించబోయే కొత్త గనులు	వార్షిక ఉత్పత్తి సామర్థ్యం (మిలియన్‌ టన్నుల్లో)
జవహర్‌ఖని (రొంపేడు)	2.00
వెంకటేశ్‌ఖని	5.30
గోలేటి ఓసీ	3.50
జీడీకే 10 ఓసీ	6.00
ఎంవీకే ఓసీ	2.00
పీవీఎన్‌ఆర్‌ (వెంకటాపూర్‌)	2.50
కేటీకే ఓసీ2- యూజీ	0.60
నైనీ	10.00
మొత్తం	31.90

డైరెక్టర్‌	విభాగం	అదనపు బాధ్యతలు
ఎన్‌. బలరాంనాయక్‌	సీఎండీ	ఫైనాన్స్‌
జి. వెంకటేశ్వరరెడ్డి	ప్లానింగ్, ప్రాజెక్ట్స్‌	పా
డి. సత్యనారాయణరావు	ఎలక్ట్రికల్‌ మెకానికల్,	ఆపరేషన్స్‌
ఎన్‌వీకే శ్రీనివాస్‌	(సెలవులో ?)	--

కిన్నెరసానిని సందర్శించిన ఒడిశా ఆర్‌సీఎఫ్‌



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌సీఎఫ్‌ ప్రసన్నకుమార్‌

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని ఒడిశా రాష్ట్ర రీజనల్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌(ఆర్‌సీఎఫ్‌) ప్రసన్నకుమార్‌ బెహరా గురువారం సందర్శించారు. డీర్‌పార్కులోని దుప్పులను, డ్యామ్‌ పైనుంచి జలాశయాన్ని, పర్యావరణ కేంద్ర భవనంలో జంతువుల అవశేషాలను తిలకించారు. ఆ తర్వాత జలాశయంలో బోటింగ్‌ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ డీర్‌పార్కు నిర్వహణ బాగుందని, కిన్నెరసాని అందాలు సూపర్‌ అని కితాబిచ్చారు. ప్రసన్నకుమార్‌ వెంట వైల్డ్‌లైఫ్‌ సెక్షన్‌ అధికారి సురేష్, ఎఫ్‌బీఓ రాములు ఉన్నారు.

పోటెత్తిన పర్యాటకులు..

వరుసగా రెండు రోజుల పాటు సెలవులు రావడంతో కిన్నెరసానికి పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి గురువారం భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 558 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌ శాఖ రూ.28,485, 400 మంది బోటింగ్‌ చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.22,380 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: ఆదివాసీ గిరిజన నాయకులు తమ జాతి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పొరేషన్‌ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో గురువారం జరిగిన జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘాన్ని 1974లో స్థాపించామని, ఈ సంఘానికి తాను ఉమ్మడి వరంగల్‌ జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని చెప్పారు. అనేక ఆదివాసీ అభివృద్ధి పనులతో పాటు వారి ఉనికి కోసం కృషి చేశానని పేర్కొన్నారు. సంఘ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. సమావేశంలో నాయకులు చందా లింగయ్యదొర, పాయం సత్యనారాయణ, సారయ్య దొర, ఝాన్సీరాణి, చొదరి లక్ష్మణరావు, అరుణ్‌ కుమార్, రమణాల లక్ష్మయ్య, ఉపేందర్, చిడం జంగు, మోకాళ్ల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వర్లు, చీమల నర్సిరావు, పాపారావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

డీసీహెచ్‌ఎస్‌ రవిబాబు

అశ్వారావుపేటరూరల్: అనారోగ్యంతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్‌ రవిబాబు అన్నారు. గురువారం ఆయన అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. రికార్డులు, హాజరు వివరాలను తనిఖీ చేశారు. ఆ తర్వాత వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది పనితీరును మెరుగు పరుచుకోవాలని, ఆస్పత్రికి గుర్తింపు తీసుకొచ్చేలా పని చేయాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో సీఎస్సార్‌ నిధులతో నిర్మిస్తున్న ఓపీ భవనాన్ని, పంచాయతీరాజ్‌ శాఖ నిధులతో నిర్మిస్తున్న ఆధునాతన మార్చురీ భవన పనులను పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ షెడ్డును పరిశీలించి, పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాధా రుక్మిణి, ఆర్‌ఎంఓ విజయ్‌కుమార్, ఫార్మసిస్ట్‌ సతీష్, సిబ్బంది నాగరాజు, కృష్ణ, ఎస్‌కే జిలానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సింగరేణి ప్రధాన కార్యాలయంలో వార్షిక సమీక్ష

హాజరుకానున్న సీఎండీ, డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వార్షిక జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించనున్నారు. ప్రతీ ఏడాది డిసెంబర్‌ నెలాఖరులో ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటుచేయడం ఆనవాయితీ. సమావేశానికి సింగరేణి సీఎండీ ఎన్‌.బలరామ్‌తోపాటు, డైరెక్టర్‌ పా జి. వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్‌ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావుతో పాటు వివిధ విభాగాల జీఎంలు, కేంద్ర, రాష్ట్ర విభాగాలకు చెందిన కంపెనీ షేర్‌ హోల్డర్లు హాజరు కానున్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌లో సెంట్రల్‌ లైటింగ్‌ను ప్రారంభిస్తారు. ఆతర్వాత పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌ వద్ద యానంబైల్‌–జిన్నగట్ట మధ్య హైలెవల్‌ బ్రిడ్జి, పాల్వంచ మండలం పాండురంగాపురంలో బీటీ రోడ్డు, లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలో బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కొత్తగూడెంలోని గణేష్‌ టెంపుల్‌ సమీపాన కమ్యూనిటీ హాల్, రైల్వేస్టేషన్‌ నుంచి ఎదురుగడ్డ వరకు విస్తరించిన రహదారిని ప్రారంభిస్తారు. అలాగే, సాయంత్రం ఖమ్మం కలెక్టరేట్‌లో మున్నేటిపై రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంపై అధికారులతో పొంగులేటి సమీక్ష నిర్వహిస్తారు. ఆతర్వాత ఖమ్మం రూరల్‌ మండలంలోని ఎం.వీ.పాలెం, తనగంపాడు, కాచిరాజుగూడెం, ఆరెకోడుల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- సంక్రాంతి నాటికి ముగ్గు పోసే పనులు ప్రారంభం
- అన్ని వర్గాల వారి సూచన మేరకే భూ భారతి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి



అశ్వారావుపేటరూరల్: వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పొంగులేటి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే తదితరులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట/ములకలపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇళ్ల నిర్మాణానికి సంక్రాంతి నాటికి ముగ్గు పోస్తామని తెలిపారు. గురువారం ఆయన దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మోడల్‌ గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాచారం, గున్నెపల్లిలో నిర్మించిన జీపీ భవనాలను ప్రారంభించారు. అశ్వారావుపేట మండలం కేసప్పగూడెం – మద్దికొండ మధ్య వాగుపై, ములకలపల్లి మండలం కొత్తూరులో హైలెవల్‌ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల కోసం 85 లక్షలకు పైగా దరఖాస్తులు రాగా, ఇప్పటికే 40 లక్షల దరఖాస్తులు పరిశీలించామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. 400 చదరపు గజాల్లో లబ్ధిదారుడి ఇష్టమైన రీతిలో నిర్మించుకోవచ్చని అన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి నాలుగు విడతల్లో రూ. 5 లక్షలు చెల్లిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పక్షపాతం లేదన్నారు. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, నాలుగేళ్ల లోపు అర్హులందరికీ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు ఇస్తున్నా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభ్యర్థన మేరకు అశ్వారావుపేట నియోజకవర్గంలో అదనంగా మంజూరు చేస్తానని ప్రకటించారు. అశ్వారావుపేట మండలం వాగొడ్డుగూడెంలో తాగునీటి సమస్యపై గ్రామస్తులు వివరించగా తక్షణమే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్‌ అధికారులను ఆదేశించారు. నారంవారిగూడెం గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ సర్పంచ్‌ సంగా శ్రీనివాసరావు ఫిర్యాదు చేయడంతో పాలేరు నియోజకవర్గానికి బదిలీ చేయాలని డీపీఓ చంద్రమౌళికి సూచించారు.

అందరి సూచనల మేరకే..

అన్ని వర్గాల ప్రజల సూచనల మేరకే ధరణిని ప్రక్షాళన చేసి భూ భారతిగా మార్చామని మంత్రి పొంగులేటి వివరించారు. భూ భారతి బిల్లు ప్రవేశపెట్టే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సైన్యం అసెంబ్లీలో కిష్కింధకాండ సృష్టించిందని ఆరోపించారు. తనపై దాడికి కూడా యత్నించారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, ఐడీసీ చైర్మన్‌ మువ్వా విజయ్‌బాబు, అదనపు కలెక్టర్‌ వేణుగోపాల్, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఇరిగేషన్‌ ఎస్‌ఈ సురేశ్, పీఆర్‌ ఈఈ శ్రీనివాసరావు, డీఈ సైదులురెడ్డి, ఏఈ సురేశ్, డీఎల్‌పీఓ రమణారావు, దమ్మపేట ఏఎంసీ చైర్మన్‌ వాసం రాణి, తహసీల్దార్లు గుడ్ల పుల్లారావు, కృష్ణప్రసాద్‌ పాల్గొన్నారు.

తుమ్మల వర్గీయుల గైర్హాజరు

దమ్మపేట మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు గైర్హాజరయ్యారు. పొంగులేటి పర్యటన సమాచారాన్ని తుమ్మలకు తెలపకుండా, ఆయనను ఆహ్వానించకుండా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఏకపక్షంగా వ్యవహరించారంటూ పలు వాట్సాప్‌ గ్రూపుల్లో ప్రచారం చేశారు. తుమ్మలను ఆహ్వానించనందునే తామూ దూరంగా ఉంటామని ప్రకటించారు. దీనికి కౌంటర్‌గా పొంగులేటి వర్గీయులు సమాధానమిస్తూ ఎమ్మెల్యేపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో ఓ కార్యక్రమ ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫొటో లేకుండా అవమానించారని, కాంగ్రెస్‌ను రెండు వర్గాలుగా విడగొట్టేలా వ్యవహరించడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే ఆదినారాయణను 'సాక్షి' వివరణ కోరగా.. అవన్నీ నిరాధార ఆరోపణలని, అవాస్తవాలని చెప్పారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరుకావాలని మంత్రి తుమ్మలకు ఫోన్‌ ద్వారా ఆహ్వానించామని తెలిపారు. అయితే ఆయన హైదరాబాద్‌లో ఇతర కార్యక్రమాలు ఉన్నందున హాజరు కాలేకపోతున్నానని చెప్పారని వివరించారు. ఈ విషయం వాట్సాప్‌ గ్రూపుల్లో ప్రచారం చేసేవారికి కూడా తెలుసని పేర్కొన్నారు.

అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా ?



దమ్మపేట : రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

భూ రిజిస్ట్రేషన్, వారసత్వం కింద పట్టా మార్పిడి చేయించుకుంటే అధికారులు అదనంగా ఏమైనా డబ్బు వసూలు చేశారా అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతులను ఫోన్‌ ద్వారా ఆరా తీశారు. దమ్మపేట తహసీల్దార్‌ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులు తనిఖీ చేశారు. మైదాన ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారి వివరాలతో పాటు ఏజెన్సీలో వారసత్వం కింద పట్టాల మార్పిడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఫోన్‌ చేసి మాట్లాడారు. కార్యాలయంలో అధికారుల పని తీరు ఎలా ఉంది, రిజిస్ట్రేషన్‌కు ఎంత ఖర్చయింది, అదనంగా ఏమైనా వసూలు చేశారా అనే వివరాలు తెలుసుకున్నారు. అధికారులు ఇబ్బంది పెట్టినా, లంచం అడిగినా తమకు సమాచారం అందించాలని కోరారు. అయితే రైతులెవరూ అధికారులపై ఫిర్యాదు చేయలేదు. కాగా, గతంలో ఏజెన్సీ ప్రాంతంలో వారసత్వంగా కాకుండా భూ పట్టాల మార్పిడి జరిగిన విషయంపై మంత్రి డిప్యూటీ తహసీల్దార్‌ వాణిని ప్రశ్నించారు. ఇలా చేయడం నేరమా కాదా అని అడగగా నేరమేనని డీటీ సమాధానం ఇచ్చారు. దీంతో ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, పనితీరు సరిగా లేకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు 'నిధి ఆప్‌ కే నికట్‌'

ఖమ్మంసహకారనగర్: సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు శుక్రవారం 'నిధి ఆప్‌ కే నికట్‌' నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారులు రబీలాల్‌దాస్, కె.సునీల్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులకు ఆన్‌లైన్‌ సేవల విధివిధానాలు, కొత్త సంస్థల యజమానులకు పరిచయం, పెన్షనర్ల సమస్యల పరిష్కారం ఉంటుందని వెల్లడించారు. ఖమ్మం జిల్లావాసుల కోసం ఖమ్మంలోని మమత ఎడ్యుకేషనల్‌ సొసైటీలో, భద్రాద్రి జిల్లా వాసులకు ఇల్లెందులోని మున్సిపల్‌ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9–15నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



ప్రత్యేక బస్సులను ప్రారంభిస్తున్న కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం) : సీఎం కప్ – 2024 రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి వివిధ క్రీడలలో పాల్గొనేందుకు క్రీడాకారులు గురువారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ బస్సులను జెండా ఊపి ప్రారంభించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్రీడాకారులకు టీషర్టులు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లి జిల్లా పేరును రాష్ట్ర స్థాయిలో నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యుగంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో రక్షణకు ప్రాధాన్యత

మణుగూరు టౌన్: భవిష్యత్ అవసరాలు, మార్కెట్‌లో డిమాండ్ దృష్ట్యా లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారిస్తూనే రక్షణ సూత్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వరరెడ్డి సూచించారు. మణుగూరు ఏరియాలో గురువారం పర్యటించిన ఆయన పీకే ఓసీ, మణుగూరు ఓసీ గనులను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించి బొగ్గు ఉత్పత్తిపై ఆరా తీశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు అందరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం దుర్గం రాంచందర్, అధికారులు శ్యాంసుందర్, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, వీరభద్రుడు, సురేశ్, రమణారెడ్డి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మావోయిస్టు ఇలాకాలో వైద్య శిబిరం

- సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్ అధ్వర్యంలో నిర్వహణ



వైద్యశిబిరంలో పాల్గొన్న ఆదివాసీలు

దుమ్ముగూడెం : ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా అటవీ ప్రాంతంలోని బేస్ క్యాంపు పరిధిలోని గ్రామాల్లో సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇచ్చిన పిలుపుతో సీఆర్పీఎఫ్, కోబ్రా భద్రతా బలగాలు ఆదివాసీల అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టు ఇలాకాగా పేరొందిన కిష్టారం, గొల్లపల్లి ప్రాంతాల్లో పాటక్‌పల్లి, డబ్బమార్క సీఆర్పీఎఫ్ 212(ఎఫ్‌ఓబి) క్యాంపుల ద్వారా కమాండెంట్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. హాజరైన ఆదివాసీ గిరిజనులకు బ్లడ్ షుగర్, కొలస్ట్రాల్, హెచ్‌డీఐ, ఎల్డీఎల్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూరిక్ యాసిడ్, హిమోగ్లోబిన్, న్యూట్రోఫిల్స్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

మట్టిలారీ సీజ్ ?

ములకలపల్లి: అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని అటవీ శాఖ అధికారులు సీజ్ చేసినట్లు విస్తృత ప్రచారం జరిగింది. మండల పరిధిలోని మాధారం అటవీ ప్రాంతంలో యథేచ్ఛగా మట్టి దందా సాగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో లారీని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై ములకలపల్లి ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్‌ను వివరణ కోరగా.. తమ పరిధిలో ఎలాంటి ఘటన చోటుచేసుకోలేదని చెప్పారు. పాల్వంచ ఎఫ్‌ఆర్‌ఓ సతీష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం వద్ద తాచుపాము!

ముదిగొండ: ముదిగొండలో వందేళ్ల చరిత్ర కలిగిన చెన్నకేశవస్వామి, లక్ష్మీనరసింహాస్వామి దేవాలయంలో గురువారం పది అడుగుల తాచుపాము కనిపించింది. మధ్యాహ్న సమయంలో ఆలయం ముందు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద పడగ విప్పి ఉన్న తాచుపామును స్థానికులు గుర్తించారు. అయితే, ఆ పాము కాసేపు అక్కడే ఉండి వెళ్లిపోయింది. కాగా, విగ్రహం వద్దకు పాము తరచుగా వచ్చివెళ్తుందే తప్ప ఎవరికీ హానీ చేయడం లేదని అర్చకులు రొంపిచర్ల నరసింహాచార్యులు, యగ్నేష్ ఆచార్యులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

ఏపీజీవీబీ.. ఇక టీజీబీ

ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా పేరు

- వచ్చేనెల 1వ తేదీ నుంచి మనుగడలోకి..
- మార్పులు, చేర్పుల కోసం నాలుగు రోజుల పాటు సేవలకు బ్రేక్
- ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 95 బ్రాంచ్‌లు



సత్తుపల్లిలోని ఏపీజీవీబీ బ్యాంక్

సత్తుపల్లిటౌన్/నేలకొండపల్లి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్(ఏపీజీవీబీ).. ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంక్(టీజీబీ)గా మారనుంది. రాష్ట్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఏపీజీవీబీ బ్యాంక్ శాఖలన్నీ విలీనం కానున్నాయి. ఈమేరకు బ్యాంకు వర్గాలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. కాగా, వచ్చేనెల 1వ తేదీ నుంచి టీజీబీ సేవలు అందుబాటులోకి రానుండగా, విలీన ప్రక్రియలో భాగంగా ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏపీజీవీబీ బ్యాంకింగ్ సేవలు నిలిపివేయనున్నారు.

పాత ఏటీఎంలు పనిచేయవు

బ్యాంకు పేరు మారినా ఖాతాదారుల నంబర్లు మారవు. అయితే, యూపీఐ సేవల కోసం కొత్తగా టీజీబీ పేరిట రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, పాత ఏటీఎం కార్డుల స్థానంలో కొత్తవి తీసుకోవాలి. అంతేకాక టీజీబీ మొబైల్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

నాలుగు రోజుల పాటు అంతరాయం

ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏపీజీవీబీ బ్యాంక్ సేవలకు అంతరాయం ఏర్పడనుంది. విలీన ప్రక్రియలో భాగంగా అంతర్గతంగా చేయాల్సిన పనులు కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ఈ మేరకు ఖాతాదారులు శుక్రవారంలోగా బ్యాంకింగ్ అవసరాలను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా, ఏపీజీవీబీకి ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 53, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 42 బ్రాంచ్‌లు ఉన్నాయి. గతంలో బ్యాంకు ప్రధాన కార్యాలయం వరంగల్‌లో ఉండగా.. ఇప్పుడు టీజీబీ ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అంతేకాక రాష్ట్రంలో కొన్ని జిల్లాలకే పరిమితమైన ఏపీజీవీబీ బ్యాంకు సేవలు ఈ విలీన ప్రక్రియతో అన్ని జిల్లాలకు విస్తరించనున్నాయి.



విలీనం అంశంపై ఏర్పాటు చేసిన పోస్టర్

మరింత విస్తృతంగా సేవలు



తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడిన తర్వాత మరింత విస్తృత సేవలు అందుబాటులోకి రానున్నాయి. విలీన ప్రక్రియ కారణంగా ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బ్యాంక్ సేవలు అందుబాటులో ఉండవు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి బ్యాంకు ఉద్యోగులకు సహకరించాలి.

– ఎం.ఉదయ్, ఏపీజీవీబీ, కొత్తగూడెం రీజినల్ మేనేజర్

పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి సీతక్క



పెద్దమ్మతల్లి ఆలయంలో మంత్రి సీతక్క తదితరులు



చిన్నారులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మంత్రి

పాల్వంచరూరల్/ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాధపురం గ్రామ పరిధిలో కొలువైన శ్రీ కనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మ వారిని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గురువారం దర్శించుకున్నారు. ఈమేరకు ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయగా మంత్రికి శేష వస్త్ర, ప్రసాదాలు ఈఓ అందజేశారు. అలాగే, ములకలపల్లి మండలంలోని సీతాయిగూడెంలో గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈసందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసిన ఆమె మాట్లాడుతూ క్రీస్తు మార్గం సదా అనుసరణీయమని తెలిపారు. ఆతర్వాత యూత్ కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన గుంపుల రవితేజను మంత్రి సన్మానించారు.

వేతనాలు ఎందుకు ఇవ్వడం లేదు?

ములకలపల్లి సీతాయిగూడెం వచ్చిన మంత్రి సీతక్కకు గ్రామపంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీంతో మంత్రి శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి జీపీ వర్కర్లకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తున్నా సకాలంలో వేతనాలు ఎందుకు చెల్లించడంలేదని ప్రశ్నించారు. సత్వరమే జీతాలు అందేలా చూడాలని ఆదేశించిన మంత్రి మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమాల్లో పేటేటి నర్సింహారావు, గుంపుల రవితేజ, కారం సుధీర్, మడకం చిరుమప్ప, కొప్పుల రాంబాబు, సురభి రాజేశ్, గుంట్రు సాయి, చిక్కుల శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, వర్కా రుక్మాంగధరరావు, మేకల రమేశ్, ఎం.రాజు, కొక్కెరగడ్డ సతీశ్, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బ్లాక్‌బెర్రీ' దీవి సందర్శనకు పూబెల్లి బృందం



బ్లాక్‌బెర్రీ దీవి సందర్శనకు వెళ్తున్న గ్రామస్తులు

ఇల్లెందురూరల్: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా సమీపాన పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న బ్లాక్ బెర్రీ దీవి సందర్శనకు ఇల్లెందు మండలంలోని పూబెల్లి నుంచి ప్రతినిధి బృందం గురువారం వెళ్లింది. పూబెల్లిని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక చొరవ తీసుకోగా ఏమేం చేయాలో ప్రణాళిక రూపొందించాలని అధికారులు, గ్రామస్తులకు సూచించారు. ఇందులో భాగంగా అవగాహన కోసం బ్లాక్ బెర్రీ దీవిని సందర్శించాలని చెప్పడంతో స్థానిక అధికారులు ఎనిమిది మందిని అక్కడకు పంపారు. ఈ బృందం బ్లాక్‌బెర్రీ దీవిలో విడిది, విహారం, కాలక్షేపం, ఆహారం తదితర ఏర్పాట్లపై అధ్యయనం చేయనున్నారు. కాగా, ప్రతినిధి బృందం వచ్చాక పూబెల్లి అభివృద్ధి ప్రణాళికలో అవసరమైన మార్పులు చేస్తామని ఎంపీడీఓ ధన్‌సింగ్, ఏపీఎం దుర్గారావు తెలిపారు. కాగా, బ్లాక్‌బెర్రీ దీవి సందర్శనకు వెళ్లిన బృందంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు తోలెం కృష్ణవేణి, గ్రామస్తులు మూతి బాయమ్మ, మూతి ముత్యాలు, జోగ శ్రీకాంత్, ఎట్టి కిరణ్, మచ్చ నవీన్, కల్తి రామకృష్ణ ఉన్నారు.

కాంట్రాక్టర్‌కు ఆర్‌ఎల్‌సీ జరిమానా



సమావేశంలో మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్‌కు రీజియన్ లేబర్ కమిషనర్ జరిమానా విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(ఎస్‌సీకేఎస్) నాయకుడు ఎస్.ఏ.నబీ తెలిపారు. ఇల్లెందులో గురువారం ఆయన మాట్లాడుతూ ఇల్లెందులో పనిచేస్తున్న ఎస్‌అండ్‌పీసీ సెక్యూరిటీ గార్డులకు కాంట్రాక్టర్ 7వ తేదీలోగా వేతనాలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అలా జరగకపోతే సింగరేణి సంస్థ అయినా చెల్లించి ఆ తర్వాత కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కానీ ఆగస్టు నెలకు సంబంధించి ఈ రెండూ జరగలేదని నబీ తెలిపారు. దీంతో లేబర్ కోర్టులో కేసు వేయగా ప్రతీ కార్మికుడికి రూ.వెయ్యి అదనంగా చెల్లించాలని ఆదేశాలు జారీ అయ్యాయని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు సుల్తానా, వెంకటలక్ష్మి, రమాదేవి, వసంత, మల్లయ్య, రాజేష్, ప్రేమ్‌సింగ్, రాజు, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల మదిలో మహోన్నత స్థానం



కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

- సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా
- జిల్లాలో పలుచోట్ల ఎర్రదండు కవాతు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ/పాల్వంచ రూరల్ : గడిచిన వందేళ్లుగా ప్రజల హృదయాల్లో సీపీఐ మహోన్నత స్థానాన్ని సంపాదించిందని పార్టీ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా అన్నారు. పార్టీ 100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా గురువారం కొత్తగూడెం, పాల్వంచతో పాటు పలు ప్రాంతాల్లో కార్యకర్తలు ఎర్ర చొక్కాలు, చీరలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో సాబిర్‌పాషా మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో, ఆ తర్వాత దేశంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు. పేదల అభ్యున్నతికి, కార్మిక, కర్షక హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణకు అనేక ఉద్యమాలు చేసిందన్నారు. ప్రజా పోరాటాలకు ఊపిరి పోసేది ఎర్రజెండా మాత్రమేనని చెప్పారు. పార్టీ వందేళ్లుగా నిర్వహించిన ప్రజాపోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, మరో వందేళ్లయినా ప్రజల పక్షాన్ని వీడదని అన్నారు. జిల్లాలోని 28 కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించామని వివరించారు. 2025 డిసెంబర్ 25న ఖమ్మంలో ఉత్సవాల ముగింపు సభ నిర్వహిస్తామని తెలిపారు. రజాకార్లు, భూ స్వాముల, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి దొరలను, దేశ్‌ముఖ్‌లను తరమికొట్టి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తల కృషి మరువలేనిదని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో ప్రముఖ వైద్యులు సూర్యదేవర రామ్మోహన్‌రావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, దమ్మాలపాటి శేషయ్య, ఉదయభాస్కర్, భూక్యా దస్రు, అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, వై.ఉదయ్ భాస్కర్, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, జి.నగేష్, వి.పద్మజ, గుండాల నాగరాజు, దుగ్గిరాల సుధాకర్, విశ్వేశ్వరరావు, సునీల్, అస్లాం, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, శ్రీను, నరహరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు అండగా ఉంటాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు, పక్కన విజయలక్ష్మి తదితరులు

పాల్వంచ: ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, లేదంటే వారికి అండగా ఉండి పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న బస్సు జాతా గురువారం పాల్వంచకు చేరింది. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా కార్మికులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ కింద పనిచేస్తున్న ఆశా వర్కర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తలకు రూ.18 వేలు వేతనం చెల్లించేవరకూ ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. గత ప్రభుత్వం అనేక సమస్యలను పరిష్కరించలేదని, ఇప్పటి ప్రభుత్వం కూడా అదే రీతిలో పనిచేస్తోందని విమర్శించారు. సమావేశంలో నాయకులు ఏజే రమేష్, బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, రమేష్, పద్మ, ఎం.వి.అప్పారావు, సత్య, ఝాన్సీ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

పాల్వంచ: పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సుజాతనగర్ మండలం వేపలగడ్డకు చెందిన మారం రాజు రాజశేఖర్ రెడ్డి (30) కొత్తగూడెంలో ఆహార రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి కొత్తగూడేనికి చెందిన ఓ మహిళతో పరిచయం ఏర్పడి సాన్నిహిత్యంగా ఉంటున్నారు. అతని నుంచి ఆమె తరచూ డబ్బులు వసూలు చేస్తోంది. ఇంకా ఇవ్వాలని వేధిస్తుడగా రాజశేఖర్ రెడ్డి ఇవ్వలేదు. దీంతో తనను ఇబ్బంది పెడుతున్నాడంటూ ఆ మహిళ తన కూతురుతో పోలీసులకు ఫిర్యాదు చేయించి యువకుడిపై పోక్సో కేసు పెట్టించింది. ఆ తర్వాత కూడా రూ.10 లక్షలు ఇవ్వాలని ఇబ్బంది పెడుతుండగా మాట్లాడేందుకు రాజశేఖర్ రెడ్డి ఈనెల 18వ తేదీన పాల్వంచలోని చంద్ర లాడ్జికి రమ్మని పిలిచాడు. అక్కడ ఆమె 'డబ్బులు ఇవ్వకపోతే వదిలేది లేదని, నిన్ను, నీ తల్లిదండ్రులను కూడా చంపేస్తా' అని బెదిరించింది. దీంతో మనస్తాపానికి గురైన రాజశేఖర్ రెడ్డి పురుగుల మందు తాగాడు. వెంటనే ఆ మహిళ అతడిని పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.3కోట్ల అప్పులు.. ఆపై మాయం

అధిక వడ్డీ ఆశతో మోసపోయిన జనం

నేలకొండపల్లి: ఎక్కడ నుండో వచ్చిన వ్యక్తి సుతారీ మేస్త్రిగా ప్రస్థానం ప్రారంభించి రకరకాల వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ చేస్తూ అందరినీ నమ్మించాడు. ఆపై అధిక వడ్డీ ఆశతో జనాన్ని ఆకట్టుకోగా అంతా కలిసి రూ.3కోట్ల మేర అప్పులు ఇచ్చారు. తీరా ఇప్పుడు కానరాకుండా పోవడంతో అప్పులు ఇచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు. నాలుగేళ్ల క్రితం ఏపీలోని అనంతపురం వాసిగా చెప్పుకున్న ఓ వ్యక్తి నేలకొండపల్లికి ఒంటరిగా వచ్చాడు. తొలుత సుతారీ పనిచేసిన ఆయన ఓ భవన నిర్మాణంలో పాలుపంచుకున్నాడు. అందరితో కలివిడిగా ఉంట పరిచయాలు పెంచుకుని అప్పులు తీసుకోవడం, ఎక్కువ వడ్డీతో చెల్లించడంతో అంతా ఆయనను నమ్మారు. ఆపై తన పనుల్లో పాలుపంచుకున్న భవనంలోనే మూడు గదులు అద్దెకు తీసుకుని వ్యాపారాలు ప్రారంభించాడు. అందులో స్థానికులనూ భాగస్వామ్యం చేసుకున్నాడు. అంతేకాక రెండు కార్లు కొనుగోలు చేసి తిరుగుతుండడంతో అంతా నమ్మసాగారు. పలువురు సొంత డబ్బు అప్పుగా ఇవ్వడమే కాక బంధువుల నుంచీ ఇప్పించారు. ఆపై సదరు వ్యక్తి రియల్ ఎస్టేట్ రంగంలోకి వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నట్లుగా ప్రచారం చేశాడు. ఆయన మరింత నమ్మకం పెంచుకున్న ఖమ్మం, నేలకొండపల్లి, రామచంద్రాపురం, బోదులబండ తదితర ప్రాంతాలకు చెందిన పలువురు రూ.3 కోట్ల మేర అప్పులు ఇవ్వగా సదరు వ్యక్తి వారం రోజులుగా ముఖం చాటేశాడు. ఫోన్ కూడా పని చేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన స్థానికులు సదరు వ్యక్తి ఇచ్చిన ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా పరిశీలిస్తే చిరునామా బెంగళూరుగా తేలింది. దీంతో బాధితులు 30మందికి పైగా గురువారం మండల కేంద్రంలో ఓ పార్టీ నాయకులను ఆశ్రయించారు. ఇంకా చాలా మందే ఆయనకు అప్పులు ఇచ్చినా బయటకు రావడం లేదని తెలిసింది. కాగా, తమకు జరిగిన మోసంపై అంతా కలిసి పోలీసులను ఆశ్రయించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక పరిధిలో ఒకరికి అమ్మిన భూమిని, తప్పుడు పత్రాలతో ఇంకొకరికి అమ్మి రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్ల రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. 2019లో అమరనేని రామకృష్ణకు 28 కుంటల భూమిని బిక్షం, కిషన్, ద్వాలీ అమ్మి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఆతర్వాత బిక్షం మరొకరి పేరుతో ధరణిలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుసుకున్న రామకృష్ణ ఫిర్యాదు చేయగా ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మైనర్ బాలిక అదృశ్యంపై...

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఇంటి నుండి బుధవారం వెళ్లిన కుమార్తె కోసం ఎక్కడా గాలించినా ఆచూకీ లేకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లైంగిక వేధింపులపై..

వేంసూరు: ఒంటరిగా ఉన్న మహిళపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు. మండలంలోని జయలక్ష్మీపురానికి చెందిన మహిళ ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన బల్లెపోగు నాగరాజు లైంగిక దాడికి యత్నించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు గురువారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వీరప్రసాద్ తెలిపారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో బుధవారం రాత్రి మద్యం మత్తులో యువకులు ఘర్షణ పడగా ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని అమర్లపూడి అరుణ్‌గాంధీ, తరుణ్‌పై అదే గ్రామానికి చెందిన మొల క్రాంతి, బద్దెల గణేష్ బీరు సీసాలతో దాడి చేశారు. ఈమేరకు గాయపడిన అరుణ్, తరుణ్ ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



గోళ్లముడి కేశవ్ (ఫైల్)

ముదిగొండ: ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, ఆయన మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మండలంలోని ముత్తారానికి చెందిన గోళ్లముడి కేశవ్(21) ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో వార్డు బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 24న చింతకాని గ్రామంలో క్రిస్మస్ జరుపుకునేందుకు ఆయన తల్లి మరియమ్మ, సోదరి స్వప్న వెళ్లారు. పండుగకు కేశవ్‌ను కూడా రావాలని సూచించగా ఆయన ముత్తారం వెళ్తానని చెప్పాడు. ఈక్రమాన బుధవారం ఆస్పత్రికి వెళ్లొచ్చిన ఆయన గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించాడు. ఈ విషయమై గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో తల్లి, సోదరి చేరుకుని కేశవ్ ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి బ్రాహ్మణపల్లి కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.3,700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.